# అపరాధి

● పాపినేని శివశంకర్

● చిత్రాలు : చంద్ర

చేతిలో పెద్ద రాయి. ఎప్పుడూ తను తేలిగ్గా దూరంగా విసిరేస్తున్నదే. కానీ, ఇవాళెందుకో ఆ రాయి చేతికి అతుక్కుపోయినట్టు... ఎంత ప్రయత్నించినా విసరలేకపోతున్నాడు! చివరికి బలమంతా ఉపయోగించి రాయి విసిరాడు. ఈసారి అది చేతి నుంచి వేరై దూరంగా పడి దొర్లసాగింది. అంతలోనే రాయి చక్రంగా మారింది, వేగంగా దొర్లుతూ... ఎదురుగా తెల్లటి పువ్వు. దాని మీదగా దొర్లింది చక్రం. పువ్వు పూర్తిగా నలిగిపోయింది. దాని కన్నీళ్ళు ఎర్రగా ఉన్నాయి. హఠాత్తుగా ఎక్కణ్ణుంచో ఒక ఎర్రటి కుక్క భయంకరంగా మొరిగి తన వెంట పడింది. తను భయంతో పరిగెత్తుతున్నాడు. పరిగెత్తీ.... పరిగెత్తీ.... చివరికి ఆగిపోయాడు. కాళ్ళు నేలకి అతుక్కుపోయినట్టు కదలటం లేదు. కదలాలనే ప్రయత్నం.... వైఫల్యం..... కుక్క ఇంకా ఇంకా దగ్గరవుతోంది. బలమంతా ఉపయోగించినా, అడుగు ముందుకు పడటం లేదు. శరీరానికి దగ్గరగా భయంకరంగా ఆ ఎర్రటి కుక్క.....

"ఊ఼... ఊ఼... హూ఼...." ఒక్క కలవరింతతో గబుక్కున లేచి కూర్చున్నాడు నరేంద్ర.

గొంతు తడారిపోయింది. ఒళ్ళంతా చెమటలు. బెడ్ పక్క టీపాయ్ మీద మంచినీళ్ళ గ్లాసు తీసుకుని గటగటా తాగాడు. కొంచెం తేరుకున్నాడు. బెడ్ లైట్ చిరుకాంతిలో గోడ గడియారం రెండూ ఇరవై చూపిస్తోంది. ఇల్లంతా శూన్య నిశ్శబ్దం. భయం గొల్పే నిశ్శబ్దం.

మళ్ళీ నిద్ర పట్టలేదు. లేచి కిటికీ దగ్గరికి నడిచాడు. ఇంటి కానుకుని వరుసగా నిద్రిస్తున్న ఇళ్ళు. నిద్రిస్తున్న ఆకాశం. మినుకు మినుకు నక్షత్రాలు. గాలి అల మీదగా కిటికీ బయట నైట్ క్వీన్ పూల వాసన. కానీ, ఆస్వాదించే స్థితి కాదు. ఎంత భయంకరమైన ఒంటరితనం? ఈ రాత్రి అరుణ తన పక్కనుంటే, ఊరట దొరికేదా? ఏమో?

మళ్ళీ దూరంగా ఆకాశంలోకి చూపు సారించాడు. చుక్కలు తప్ప మరేమీ కనిపించటం లేదు. హఠాత్తుగా ఎక్కణ్ణుంచో 'హంతకుడా! హంతకుడా!' అనే కేక. ఎక్కణ్ణుంచి? తనలోంచే. హంతకుడేనా తను? ఆ పిల్లాడు చనిపోయాడా? బతికుంటే ఎంత బాగుండును. కానీ, ఎలా బతుకుతాడు? ఇప్పుడేం చేయగలడు తను? ఈ రోజు ఉదయం ఏం జరిగింది?.....

## 2

ఇంట్లో ఎవ్వరూ లేరు. భార్య అరుణ, కూతురు ఉమ, చిన్నవాడు కిట్టూ ఊరెళ్ళారు. మామగారి ఊళ్ళో చుట్టాల ఇంట్లో పెళ్ళి. మార్చి నెలాఖరు కావటాన తనకి బ్యాంకులో సెలవు దొరక్క ఉండిపోయాడు. ఇంట్లో అరుణ లేకపోయినా హోటల్‌కి వెళ్ళే అలవాటు లేదు. వంట కాస్త తెలుసు. రాత్రి పొద్దుపోయిందాకా ఏదో నవల చదువుతూ ఆలస్యంగా పడుకున్నాడు (అరుణ ఉంటే అంతసేపు నిద్ర కాయనిచ్చేది కాదు). పొద్దున్నే లేవటానికి బద్ధకించాడు. పాలమనిషి ఆరింటికే వచ్చి బెల్ మోగించినా పాలగిన్నె అలమార్లో పెట్టి మళ్ళీ ముసుగు తన్నాడు. మళ్ళీ ఏడున్నరకిగాని మెలకువ రాలేదు. కాలకృత్యాలు తీర్చుకునేసరికి పనిమనిషి వచ్చి అంట్లు తోమి, బట్టలు ఉతికి వెళ్ళిపోయింది. వంట చేసుకుని భోజనం ముగించే పాటికి తొమ్మిదీ యాభై అయిదు నిమిషాలైంది. ఇంకా ఏడు నిమిషాల్లో దాదాపు పది కిలోమీటర్లు - 'పీక్ అవర్'లో ట్రాఫిక్ తప్పించుకుంటూ - రమణ నగర్ ఆంధ్రా బ్యాంక్‌కి చేరుకోవటం అసాధ్యం. అయినా, వేగంగా వెళ్ళాలి. అసలే ఇవాళ కాస్త పెందలాడే రమ్మని మేనేజర్ చెప్పాడు.

మళ్ళీ నిద్ర పట్టలేదు. లేచి కిటికీ దగ్గరికి నడిచాడు. ఇంటికానుకుని వరుసగా నిద్రిస్తున్న ఇళ్ళు. నిద్రిస్తున్న ఆకాశం. మినుకు మినుకు నక్షత్రాలు. ఎంత భయంకరమైన ఒంటరితనం?

స్కూటర్ నాల్గో గేర్‌లోకి మార్చి స్పీడందుకునేలోగా ఒక కుక్క అడ్డం వచ్చింది. నరేంద్ర అనహనంగా బ్రేక్ వేసేలోగానే తప్పుకుంది (కుక్కలు చురుకైన జంతువులు). మళ్ళీ స్పీడందుకున్నాడు. ఈసారి ఏం అడ్డం వచ్చినా స్పీడు తగ్గించకూడదు. నేర్పుగా తప్పించుకోవాలి. కాలేజీకి సైకిళ్ళ మీద వెళ్ళే కుర్రాళ్ళు ఎదురవుతున్నారు (వాళ్ళకి స్కూటర్లంటే అసలు లెక్కుండదు. చిన్న సందు దొరికితే దూసుకుపోతారు).

స్పీడ్.... స్పీడ్.... స్పీడ్.... ట్రాఫిక్ ఏమంత లేకుంటే ఎంత స్పీడ్‌గా వెళ్ళినా బాగానే ఉంటుంది. వెధవది సరిగ్గా ఇప్పుడే అందరికీ హడావిడి. అందునా సిటీ బస్‌ల గోల. వాడు వెనక వస్తున్నా ప్రమాదమే. ముందు వెళ్తున్నా ప్రమాదమే. పోతూ పోతూ ఇంత దుమ్ము పొగ మొగాన చిలకరించి పోతాడు.....అదుగో వెనకాల సిటీ బస్ - 'యముని మహిషం'. తను సైడ్ ఇచ్చేలోగానే దూసుకెళ్ళి కాస్త ముందుకు పోయి రోడ్డు మధ్యలోనే ఒక్క కుదుపుతో ఆగింది. దాన్ని తప్పించుకుపోయే అవకాశం లేక బలవంతాన బ్రేక్ వేసి వెనకే ఆగిపోయాడు. పొగ...దుమ్ము.... ఎంత చిరాకో? ఇందాకేగా ఫలానా తార సౌందర్య రహస్యమైన సబ్బుతో హాయిగా స్నానించింది? ఈ బస్ డ్రైవర్ని తన్నినా పాపం లేదు. అతి కష్టం మీద బస్‌ని క్రాస్ చేసి మళ్ళీ ముందుకు దూకించాడు స్కూటర్ని. అల్లంత దూరంలో గాంధీ టవర్ సెంటర్. రెడ్ సిగ్నల్. ఆగాలి. ఆగాలి. లేకపోతే పోలీసువాడు ఊరుకోడు. మళ్ళీ బ్రేక్.

చూపులు బెదురుగా వాచీ మీదికి మళ్ళాయి. పదీ పది. ఇంకా రెండు సిగ్నల్స్ దాటాలి. గజిబిజిగా బిజీ బిజీగా ఉండే సన్నటి బోస్ రోడ్డు గుండా కిలోమీటర్ పోవాలి. కనీసం మరో పది నిమిషాలు. ఎలా? అసలే క్యాష్ కౌంటర్లో పని. లేటుగా వెళ్ళటం తనకి అలవాటే లేదు. మేనేజర్ ఏమనకపోయినా, తనకే చిన్నతనంగా ఉంటుంది. నాల్గో తరగతి చదువుతున్న కిట్టూగాడికున్న ఇంగిత జ్ఞానం కూడా లేదా తనకి? స్కూలు తొమ్మిదింటికైనా ఎనిమిది దాటినప్పట్నుంచీ ఎంత హడావిడి చేస్తాడు? స్కూల్ రిక్షా కోసం పావు గంట ముందునుంచే ఎదురుచూస్తుంటాడు. మరి తను?..... తన మీద తనకే చిరాకేసింది నరేంద్రకి. అనహనంగా యాక్సిలేటర్ తిప్పాడు.

బోస్ రోడ్డు మలుపు వచ్చింది. ఆ సన్నటి రోడ్డు బ్యాంక్‌కి దగ్గర దారి. వచ్చే పోయే వాహనాల్నీ మనుషుల్నీ తప్పించుకుంటూ వెళ్ళటం ఎంతో ఇబ్బంది. తన నేర్పంతా ఉపయోగిస్తూ నడుపుతున్నాడు స్కూటర్‌ని. నలభై.... అయిదు.....ఏభై చూపిస్తోంది స్పీడోమీటర్. స్పీడ్...టెన్షన్.... స్పీడ్.... హఠాత్తుగా పక్క గల్లీ లోంచి ఒక బంతి దొర్లుకుంటూ.... బంతే గదా! నరేంద్ర బ్రేక్ వేయలేదు. ఆ వెనకే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ బంతి కోసం....నరేంద్ర ఊహించలేదు. మెదడేదో ప్రమాదాన్ని శంకించింది. ఎలర్ట్ కావాలి.... పిల్లవాణ్ణి తప్పించాలి. సాధ్యం కానంత దగ్గరగా..... బ్రేక్ వెయ్యాలి. వేసేలోగా... స్కూటర్‌ని దాటిపోయేలోగా గుద్దేసింది.

"అమ్మా!" పిల్లాడి ఆర్తనాదం.

సడెన్ బ్రేక్‌తో కీచుమంటూ గిర్రున పక్కకి తిరిగి అల్లంత దూరంలో ఆగింది స్కూటర్. ఇంజన్ ఆగలేదు. నరేంద్ర దిమ్మెరపోయాడు.

"అరెరె!"

"అయ్యో!"

"ఏక్సిడెంట్!"

"అమ్మా! అమ్మా! ఓ...." ఆర్తనాదం.

గందరగోళం. జనం మూగుతూ....ట్రాఫిక్ జామ్..... నెత్తురు మడుగులో ఆ పిల్లాడు.... నరేంద్ర స్కూటర్ స్టాండ్ వెయ్యబోయాడు.

"అడుగో అతనే! ఆ స్కూటరే!" ఎవరిదో దోషిని చూపిస్తూ భయపెట్టే గొంతుక.

నరేంద్ర కంపించిపోయాడు. ఆలోచించే వ్యవధి లేదు. బ్యాంక్‌కి ఆలస్యమవుతుందా? జనం మధ్య నేరస్థుడుగా తనకి ప్రమాదమా? లేదా అదంతా పట్టించుకోవాల్సిన విషయం కాదా?...ఏమో.... క్షణాల మీద స్కూటరెక్కి యాక్సిలేటర్ పెంచుతూ, గేర్లు మార్చుతూ... స్కూటర్ ముందుకు దూకింది.

"అరెరె! పోతున్నాడు, పోతున్నాడు, ఆపండి!"

"రాస్కెల్!"

"నెంబర్! స్కూటర్ నెంబర్ చూడండి!"

స్కూటర్ ఆగలేదు. నరేంద్ర వెనక్కి తిరిగి చూడలేదు. తన గుండె చప్పుడు తనకే వినిపిస్తోంది. మరో రెండు నిమిషాల్లో స్కూటర్ బ్యాంక్ ఆవరణలో ఆగింది.

లోపలికి ఎలా వచ్చాడో, మేనేజర్ ఏమన్నాడో, ఎలా డబ్బు కట్టలు రిసీవ్ చేసుకున్నాడో, క్యాష్ కౌంటర్‌లోకి ఎలా వచ్చి కూర్చున్నాడో- అంతా మెదడుతో ప్రమేయం లేకుండానే జరిగిపోయినట్టుంది. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. కౌంటర్ ముందు కస్టమర్లు చేరుతున్నారు. ఏళ్ళ తరబడి అలవాటైన పని గనక అర్ధచైతన్యంతోనే చెక్కులు, విత్‌డ్రాయల్స్ తీసుకుని నోట్ చేయటం, టోకెన్‌లు తీసుకోవటం, నోట్లు లెక్కపెట్టి ఇవ్వటం - అన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి.



నరేంద్ర ఆలోచనలు పరివరి విధాల పోతున్నాయి. పైన ఫ్యాన్ తిరుగుతున్నా ఊపిరాడటం లేదు. ఒక్కసారి తలెత్తి చూశాడు. కొత్త లోకాన్ని చూస్తున్నట్టుగా ఉంది. అంతామామూలే.ఎడమ పక్క రిసీవింగ్ కౌంటర్లో నాగబ్రహ్మాం సీరియస్‌గా చలానా స్లిప్‌లూ, డబ్బూ తీసుకుంటూ లెక్కపెడుతూ స్లిప్‌ల మీద టకటకా స్టాంప్‌లు వేస్తూ బిజీగా ఉన్నాడు. అటువైపు సుబ్రహ్మణ్యం పాస్ బుక్‌లూ, విత్‌డ్రాయల్సూ, చెక్‌లూ తీసుకుంటూ, ఎంట్రీలు వేస్తూ, టోకెన్‌లూ ఇస్తూ ఉన్నాడు. మేనేజర్ చాంబర్‌లో ఎవరో ఇద్దరు కస్టమర్లు కూర్చుని మాట్లాడటం కనిపిస్తోంది. ఎవ్వరికీ తన మనసులో రేగే తుపాను సంగతి తెలీదు. సన్నగా తలనొప్పి. తల పట్టుక్కూర్చున్నాడు ఒక్క నిమిషం.

''హలో!''

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. ఎదురుగా యూనిఫాంలో- సబ్‌ఇన్‌స్పెక్టర్ అయి ఉండాలి - నిలబడి ఉన్నాడు. తనవంకే సూటిగా చూస్తున్నాడు. నరేంద్ర పై ప్రాణాలు పైనే పోయాయి. అంతా అయిపోయింది. తనను అరెస్టు చేయటానికే వచ్చి ఉంటాడు. ఏం చెయ్యగలడు? స్టాఫ్పూ, కస్టమర్లూ అంతా తన వంకే చూస్తున్నట్టనిపించింది. ముఖం పాలిపోయింది. అతని వంక చూడలేక తల వంచుకున్నాడు.

''హలో! మిమ్మల్నే క్యాష్ ఇస్తారా?'' కౌంటర్ కంత లోంచి అద్దం మీద టోకెన్ పెడుతూ మర్యాదగా అడిగాడతను.

ఒక్క క్షణం నరేంద్ర కేమీ అర్థం కాలేదు. మరుక్షణం తేరుకున్నాడు. ఓహో! అతను డబ్బు విత్‌డ్రా చెయ్యటానికి వచ్చాడుకానీ, పోలీసుగా రాలేదన్నమాట.

హమ్మయ్య, ఎంత భయపడ్డాడు! నరేంద్ర ఒక్కసారి గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు. పక్కనే స్లిట్ లోంచి చెక్ తీసుకుని, ఎంట్రీ వేసి, నోట్లు లెక్కపెట్టి ఇచ్చాడు.

''థాంక్స్'' చెప్పి కదిలాడు ఇన్‌స్పెక్టర్. అతను ద్వారం దాటి బయటికి వెళ్ళేదాకా అటే చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచాడు నరేంద్ర. తన అకారణ భయానికి తనకే నవ్వొచ్చి మనసు తేలిక పడడానికై పైకే నవ్వాడు. పక్క చాంబర్ లోంచి నాగబ్రహ్మాం తల తిప్పి ఆశ్చర్యంగా చూశాడు.

''ఏం బ్రదర్, ఇవాళ వింతగా కనబడుతున్నావ్? ఏంటి సంగతి?'' అడిగాడు నవ్వుతూ. ''అవునూ, మొహమేంటి అట్లా కందిపోయి ఉంది?'' అన్నాడు మళ్ళీ పరీక్షగా చూస్తూ.

నరేంద్ర ఉలిక్కిపడ్డాడు. వింతగా కనిపిస్తున్నాడా తను? ''అబ్బే, ఏం లేదు, ఏం లేదు. బాగానే ఉన్నాను'' అన్నాడు తొందరగా.

కానీ, మనసు నిండా గజిబిజి..... ఆందోళన.

ఎంత పని జరిగింది? అంత అజాగ్రత్తగా స్కూటర్ ఎట్లా నడిపాడు? అంతలోనే ఆ పిల్లాడు రావడమేమిటి? ఒక్క క్షణం ముందో వెనకో అయితే ప్రమాదం తప్పి ఉండేది. రోజూ నిదానంగా వచ్చేవాడు. ఇవాళేదో పిచ్చి పట్టినట్టు అంత స్పీడు నడపటమేమిటి? కాస్త ముందుగా బయల్దేరి ఉంటే ఇదిలా జరిగేదే కాదు.... నెత్తురు మడుగులో ఆ పిల్లాడు! స్కూటర్ పొట్ట మీదగా పోయిందా? కాలు మీదగానా? ఎంత రక్తం! చనిపోతాడా?

తన ఆలోచనకి తనకే భయం వేసింది. గొంతెండిపోయి నాలుక పిడచ గట్టుకుపోయింది. మంచినీళ్ళు తెప్పించుకుని తాగాడు. అంతరంగంలో ఏదో నిస్సహాయ ఆక్రోశం.

''సార్!''

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. అంతకుముందే డబ్బు తీసుకున్న మనిషి.

''వంద రూపాయలు ఎక్కువిచ్చారు'' అంటూ నోట్లబొత్తి అందించాడు.

చెక్ మీద అంకె మరోసారి చూసి నోట్లు లెక్కపెట్టాడు. ఒక నోటు ఎక్కువ ఉంది. దాన్ని సొరుగులో వేసి, 'థాంక్స్' చెప్పి, డబ్బిచ్చాడు. అతను నవ్వి వెళ్ళిపోయాడు. కౌంటర్ ముందు ఎవరూ లేరు.

ఆ పిల్లాడు చనిపోయాడేమో! ఎంత నెత్తురు! చనిపోతే ఎలా? చూసినవాళ్ళు రిపోర్ట్ ఇవ్వకుండా ఉంటారా? తను ఆగకుండా వచ్చేటప్పుడు ఎవరో స్కూటర్ నంబర్ చూడమనటం గుర్తుకొస్తోంది. తప్పకుండా చూసే ఉంటారు. పైగా, పెద్ద పెద్ద అంకెల్తో వేయించిన నంబర్. ఇలాంటి ప్రమాదం వస్తుందని ఎవరూహించగలరు? ఇప్పుడెట్లా? పోలీసులు తప్పకుండా తన స్కూటర్ కోసం వెతుకుతుంటారు. అరెస్టు చేస్తే సాటివాళ్ళ ముందు ఎంత తలవంపు! ఏం చెయ్యాలి? ఎలా తప్పించుకోవాలి? మై గాడ్!

మధ్యాహ్నానికి బాగా తలనొప్పి వచ్చింది. టాబ్లెట్స్ తెప్పించుకుని కాఫీ తాగాడు. అయినా, ఒళ్ళంతా నీరసంగా ఉంది. అలాగే లెక్కలు పూర్తి చేసి, మర్నాటికి సెలవు పెట్టి, టైం కాగానే బయటపడ్డాడు. కాళ్ళు అలవాటుగా స్కూటర్ స్టాండ్ వైపు నడిచాయి. స్కూటర్‌ని చూడగానే ఒళ్ళంతా జలదరించింది. భయంతో కూడిన అసహనం కలిగింది. 'ఎలా ఉందో, దున్నలాగా' అనుకున్నాడు. రెండేళ్ళ కిందట మోజుపడి కొనుక్కున్న స్కూటరే, 'గచ్చకాయ రంగులో నిగనిగలాడుతూ ఎంత బాగుందో బుజ్జిముండ' అనుకున్న స్కూటరే. కానీ, ఇప్పుడు? నెత్తురు మరకలంటిన స్కూటర్!

స్కూటర్‌ని ముట్టుకుంటుంటే ఆ స్పర్శ ఎలాగో ఉంది. స్టార్ట్ చేసి బజార్లోకి వచ్చాడు. ఒక్కసారిగా ఏదో వింత లోకంలో అడుగు పెట్టినట్టుగా ఉంది. వేగంగా నడుస్తూ అటూ ఇటూ వెళ్తున్న జనం, బస్సులు, కార్లు, స్కూటర్లు, సైకిళ్ళు - ఎవర్నీ ఎవరూ పట్టించుకోని జనం. అయినా, ఎక్కణ్ణుంచో ఏవో అదృశ్య నేత్రాలు తనని పరీక్షగా చూస్తున్న అనుభూతి. ఎవరో తనని దోషిగా చూస్తున్నారు. పట్టుకోవాలని చూస్తున్నారు. తను అదే యాక్సిడెంట్ చేసిన స్కూటర్ మీదే ఉన్నాడు. తప్పించుకోవాలి.

ఒక ఆలోచన తట్టింది. ఇలా స్కూటర్ ఇంటికి వేసుకెళ్ళడం కంటే ఇక్కడే ఎక్కడైనా వదిలేస్తే మంచిది. ఎక్కడ?... అక్కడికి ఫర్లాంగు దూరంలో ఉన్న షబ్బీర్ మెకానిక్ షెడ్ గుర్తొచ్చింది. ఎప్పుడన్నా చిన్న చిన్న రిపేర్లొస్తే, స్కూటర్ అక్కడే ఇస్తుంటాడు. నేరుగా వెళ్ళి షబ్బీర్ కప్పజెప్పాడు స్కూటర్‌ని. సర్వీసింగ్ చేయించి, కార్బొరేటర్ క్లీన్ చేసి, బ్రేకులు చెక్ చేసి ఉంచమని చెప్పాడు.

స్కూటర్ అప్పజెప్పి మళ్ళీ వీధిలోకి రాగానే కొంత 'రిలీఫ్' దొరికినట్టనిపించింది.

సిటీ బస్సెక్కి ఇంటికి చేరాడు. ఆరు గంటలైంది. పక్క వాటా ముసలమ్మ పాలగిన్నె ఇస్తూ అంది: ''ఇందాక నీ కోసం ఎవరో వచ్చి వెళ్ళారయ్యా!''

నరేంద్ర గతుక్కుమన్నాడు. ఎవరై ఉంటారు? పోలీసులా? తన ఆచూకీ ఎలా తెలిసింది? ''ఎ.... ఎవరు?'' అడిగాడు తడబడుతూ.

"ఏదో పేరు చెప్పాడయ్యా! అదేంటీ....ఆఁ, గోపాలరావంట. నన్నగా - పొడుగ్గా ఉన్నాడు."

ఊపిరి పీల్చుకున్నాడు నరేంద్ర. గోపాలరావు పరిచయస్థుడే. బ్యాంక్ లోన్ ఇప్పించమని తిరుగుతున్నాడు.

తలుపు తాళం తీసి హాల్లోకి నడిచి పడక్కుర్చీలో కూలబడ్డాడు. ఇల్లంతా బోసిగా, శూన్యంగా ఉంది. మనసూ అలాగే.....ఆందోళన, దుఃఖం. కళ్ళు మూసుకుంటే అదే దృశ్యం — నెత్తురు మడుగులో పిల్లాడు — కడుపులో దేవుతున్నట్టుగా ఉంది. జ్వరంగా.... మగతగా.....ఎప్పుడు లేచి పక్క మీద పడుకున్నాడో? తిరిగి ఈ పీడ కల లోంచే మెలకువ. మళ్ళీ నిద్ర పట్టలేదు. ఎప్పుడో వేకువజామకి మెల్లగా మగతలోకి జారుకుంది మనసు.



## 3

ఉదయం ఏడు గంటలకు మెలకువ వచ్చింది. నీరసం... కొంచెంగా జ్వరం. కళ్ళు ఎర్రబడి మండుతున్నాయి. కాసేపటికి పక్కవాటా మునలమ్మ వచ్చి పాలగిన్నె ఇచ్చింది. పాలమనిషి కాలింగ్ బెల్ మోగించీ మోగించీ, ఎంతకీ తను లేవకపోతే పక్క ఇంట్లో పాలు పోసి, తనకివ్వమని చెప్పిందట.

ముఖం కడుక్కుని కాఫీ తాగుతుండగా, ఒక ఆలోచన వచ్చింది. బోస్ రోడ్డుకి వెళ్ళి ఎవర్నైనా యాక్సిడెంట్ గురించి అడిగి తెలుసుకుంటే? స్కూటర్ నంబర్‌ని ఎవరైనా గుర్తు పట్టారా? ఒకవేళ ఆ పిల్లాడు బతికాడేమో? కనుక్కునే దాకా మనశ్శాంతి ఉండదు. ఎవరూ తనని గుర్తుపట్టకుండా జాగ్రత్తపడాలి. చీకటి పడేదాకా ఆగటం మంచిది.

జ్వరం తగ్గలేదు. నూరు డిగ్రీలుంది. ఆ రోజంతా పక్క మీదే అశాంతిగా అటూ ఇటూ దొర్లుతూ గడిపాడు. కొంచెం మగత. మగతలో రకరకాల ఆలోచనలు. భయంతో, బాధతో కూడిన ఆందోళన. 'నేను దోషిని. దోషినే కాదు, పిరికివాణ్ణి కూడా' అనుకున్నాడు. 'కాలం ఇప్పుడు ఒక రోజు వెనక్కి జరిగితే ఎంత బాగుండును? యాక్సిడెంట్ జరక్కుండా ఉంటే ఎంత మనశ్శాంతిగా ఉండేది? జరిగిపోయినదాన్ని జరక్కుండా ఎలా చేసేది? హంతకుడా! దురదృష్టవంతుడా! ఏది నీకు దారి?'

కనుచీకటి పడేటప్పుడు నరేంద్ర ఓపిక తెచ్చుకుని బయటికి బయల్దేరాడు. సిటీ బస్సెక్కి బోస్ రోడ్డు మూల మీద దిగాడు. అక్కడో బడ్డీ కొట్టుంది. అప్పుడప్పుడూ తను అక్కడే ఆగి సిగరెట్లు తీసుకుంటాడు. కొట్టు కుర్రాడు హుషారైనవాడు. అక్కడికి నడిచి సిగరెట్ పాకెట్ తీసుకుని యథాలాపంగా అడిగాడు - నిన్నటి యాక్సిడెంట్ గురించి.

"ఎవడో సార్! గుద్దేసి వెళ్ళిపోయాడు. స్కూటర్ నెంబర్ కూడా ఎవరూ గుర్తుపట్టలేదు."

నరేంద్ర మనసు స్తిమితపడింది. 'స్కూటర్ నంబర్ గుర్తుపట్టలేదంటే యాక్సిడెంట్ తను చేసినట్టు ఎవరికీ తెలీదు. ఓహ్! ఎంత హాయిగా ఉందిప్పుడు?' సిగరెట్ తీసి వెలిగించాడు.

"మరి ఆ పిల్లాడికి...." అడిగాడు తడబాటుగా.

"పాపం, స్పృహ తప్పి పడిపోయాడు. బాగా రక్తం పోయింది. హాస్పటల్‌కి తీసుకెళ్ళారు. బతుకుతాడో లేదో" చెప్పాడతను.

నరేంద్ర మనసులో మళ్ళీ గాయం రేగింది. తీరని విచారంతో స్థాణువులా అలాగే నిలబడిపోయాడు. సిగరెట్ వెగటనిపించింది. దూరంగా పారేసి, మళ్ళీ అతనితో అన్నాడు:

"ఆ పిల్లాడు బతికాడో లేదో కాస్త కనుక్కుంటావా?"

"దానికేముంది సార్! నాక్కూడా బాధగా ఉంది. తప్పకుండా కనుక్కుంటాను" అన్నాడా కుర్రాడు.

నరేంద్ర అక్కడ నిలబడలేక ముందుకు నడిచాడు. ఆ సాయంకాలపు పట్టణ జనం మధ్య తనొక్కడే ఏకాకిగా అనిపిస్తోంది. అలా నడుస్తుండగా స్కూటర్ సంగతి గుర్తొచ్చింది. మెకానిక్ షెడ్‌దాకా వెళ్ళి స్కూటర్ తీసుకున్నాడు. స్కూటర్ నీట్‌గా.... ఏ యాక్సిడెంట్ ఎరగనట్టుగా..... అమాయకంగా ఉంది. మరి తను?

ఇంటికెళ్ళి వంట చేసుకునే ఓపిక లేదు. అన్నం తినాలనీ లేదు. దార్లో కోమల విలాస్ దగ్గర ఆగి రెండు ఇడ్లీలు తిని, కాఫీ తాగాడు. ఒంట్లో కాస్త చురుకుదనం.

దార్లో కృష్ణారావు కనిపించాడు. సైకిల్ మీద ఎక్కడికో వెళ్తున్నాడు. స్కూటర్ ఆపాడు తను.

"ఇంటికేనా? చాన్నాళ్ళయింది కలుసుకుని. ఏమిటీ సంగతులు?" నవ్వుతూ అడిగాడు కృష్ణారావు.

తనకి మంచి స్నేహితుడు. ఇబ్బందుల్లో తోడుగా నిలబడగలవాడు. అరుణ ప్రసవించే సమయంలో తను భయపడ్డాడు. పిండం అడ్డం తిరిగిందన్నారు. సిజేరియన్ చెయ్యాలన్నారు. ఆ సమయంలో తనకి ధైర్యం చెప్పి తనతోపాటు ఒక రోజంతా హాస్పిటల్‌లోనే ఉన్నాడు. అప్పటినుంచీ అతనంటే తనకే కాదు, అరుణకీ ఎంతో అభిమానం. అతను తమ కుటుంబంలో ఒకడుగా కలసిపోయాడు.

అతని పలకరింపుకి సమాధానంగా ఏదో నసిగాడు. లోపల మాత్రం అతను కనిపించేసరికి కొంత మనస్తిమితం చిక్కింది. ఎందుకో తను ఈ దశలో ఒంటరివాడు కాడనిపించింది. అయినా, మనసు విప్పి యాక్సిడెంట్ సంగతి చెప్పలేకపోయాడు.

"ఏమిటోరా నరేంద్రా! ఒకే ఊళ్ళో ఉంటున్నా తరచు కలుసుకోలేకపోతున్నాం. అన్నట్టు లీలా మహల్‌లో మంచి సినిమా వచ్చింది, వెళ్దామా?" అని అడిగాడు కృష్ణారావు.

"ఇప్పుడు మూడ్ లేదులేరా" అన్నాడు నరేంద్ర.

"ఇవాళ కాకుంటే రేపో, ఎల్లుండో వెళ్దాం. అమ్మాయీ, పిల్లలూ ఏం చేస్తున్నారు?"

అరుణని 'అమ్మాయి' అనే అంటాడు కృష్ణారావు. వాళ్ళు ఊరెళ్ళినట్టు చెప్పాడు నరేంద్ర.

"అయితే, భోజనానికి మన ఇంటికి రారాదూ?"

"ఫర్వాలేదులే. వంట చేతనవునుగదా!"

"సరే, మళ్ళీ కలుస్తాను" అని సైకిలెక్కాడు కృష్ణారావు.

నరేంద్ర ఇల్లు చేరాడు. జ్వరం తగ్గినట్టు లేదు. మనసులో ఒక ఆందోళన తగ్గి మరో ఆందోళన ఎక్కువైంది. తను యాక్సిడెంట్ చేసిన సంగతి ఎవరూ గుర్తించనందుకు మనసు తేలికపడింది. భయం తొలగిపోయింది. కానీ, దాని స్థానంలో ఆ పిల్లాడిని గురించిన ఆలోచన చోటు చేసుకుంది. అతను చనిపోయి ఉండొచ్చుననే ఊహే భయంకరంగా తోస్తోంది.

రాత్రి తొమ్మిది గంటలకి ఫోనొచ్చింది, మామగారి ఊరునుంచి. అరుణ, కిట్టూకి నిన్నటి నుంచి బాగా జ్వరంగా ఉందనీ, ఈ రోజు కూడా తగ్గకపోతే హాస్పిటల్‌లో చేర్పామనీ, తనకేదో భయంగా ఉందనీ, వీలైతే బయల్దేరి రమ్మనీ ఆదుర్దాగా చెప్పింది. అంతలో ఫోను బావమరిది సత్యం తీసుకున్నాడు. మరేం కంగారు పడొద్దనీ, ఈ రాత్రికి జ్వరం తగ్గిపోతుందని డాక్టరు చెప్పాడనీ, (దూరాభారం గనక) వెంటనే రానవసరం లేదనీ, మళ్ళీ ఉదయాన్నే ఫోన్ చేస్తాననీ చెప్పాడు.

నరేంద్ర డీలా పడిపోయాడు. రకరకాల భయాలు చుట్టుముట్టాయి. కిట్టూకి సీరియస్‌గా లేకపోతే ఎందుకు ఫోన్ చేస్తారు? తను వెళ్ళగలిగితే బాగుండును. కానీ, ఇప్పట్లో రైలు లేదు. ఒంట్లో జ్వరమూ తగ్గలేదు.

ఒకవేళ కిట్టూకేమైనా అయితే తను భరించగలడా? ఇదంతా తను చేసిన యాక్సిడెంట్ ఫలితమా? దేవుడిట్లా తనని శిక్షిస్తున్నాడా? తనెప్పుడూ దేవుణ్ణి పెద్దగా పట్టించుకున్నది లేదు. అరుణ పూజలూ, వ్రతాలూ చూసి ఎగతాళి చేస్తుండేవాడు. కానీ, ఇప్పటి పరిస్థితి వేరు.

కాళ్ళు దేవుడి గూడువైపు నడిచాయి. గూడు మధ్యలో వెంకటేశ్వరస్వామి పటం. అటువక్క లక్ష్మీదేవి.

జ్వరం తగ్గలేదు. నూరు డిగ్రీలుంది. ఆ రోజంతా పక్క మీదే అశాంతిగా అటూ ఇటూ దొర్లుతూ గడిపాడు. కొంచెం మగత. మగతలో రకరకాల ఆలోచనలు. భయంతో, బాధతో కూడిన ఆందోళన.

ఇటువక్క వినాయకుడి బొమ్మ. పసుపూ కుంకుమలు, సగంలో ఆరిపోయిన అగరొత్తి. చేతులు వణకుతుండగా దేవుడికి నమస్కారం చేశాడు. ''భగవంతుడా! నా అపరాధం క్షమించు. కిట్టూ ప్రాణాలు కాపాడు.''

## 4

రాత్రి ఎలా నిద్ర పట్టిందో, తెల్లారింది మొదలు ఫోన్ కోసం ఎదురు చూడసాగాడు. జ్వరం తగ్గింది. ఎనిమిది అవుతుండగా ఫోన్ మోగింది. గబాల్న అందుకున్నాడు. రాంగ్ నంబర్. విసుగ్గా పెట్టేశాడు. మళ్ళీ ఎంతకీ ఫోన్ రాలేదు. తను ప్రయత్నిస్తే లైన్లు సరిగా లేవన్నారు. ఆ ఆందోళనతోనే బ్యాంక్‌కి బయల్దేరాడు. ఇంటికి తాళం వేసిన తర్వాత ఫోనేదో మోగినట్టనిపించింది. మళ్ళీ తలుపు తీశాడు. కేవలం తన భ్రమ.

బ్యాంక్‌లో ఉన్నంతసేపూ ఆందోళన తగ్గలేదు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఎందుకో ఆ పిల్లాడి మరణానికీ కిట్టూ బతుక్కీ ఏదో సంబంధం ఉందనిపించింది. అతను చనిపోకుండా ఉంటే ఎంత అదృష్టం! బడ్డీకొట్టు కుర్రాడు ఏం వార్త చెబుతాడో?

అంతలో నరేంద్రకి వింతైన ఆలోచన వచ్చింది. ఎంతోమంది మనుషులు స్కూటర్ల మీదా, సైకిళ్ళ మీదా, నడుస్తూ ఎదురవుతున్నారు. బోస్ రోడ్డు చేరేదాకా ఏ మనిషీ నల్ల చొక్కాతో ఎదురుకాకూడదు. ఎదురుకాకపోతే ఆ పిల్లాడు బతికున్నట్టే లెక్క. ఎదురైతే చనిపోయినట్టు... స్కూటర్ నడుపుతూ ఆ అంశం మీదనే తన బతుకంతా ఆధారపడి ఉన్నంత ఆందోళనగా అటూ ఇటూ చూస్తున్నాడు. గిరిపేట... మార్కెట్ బజార్... ఇంకాస్త దూరం పోతే బోస్ రోడ్డు. అప్పటిదాకా ఏ మనిషీ నల్ల చొక్కాతో ఎదురురానందుకు సంతోషించాడు. కానీ, అదృష్టం అతన్ని వెక్కిరించింది. బోస్ రోడ్డు మలుపు అల్లంత దూరంలో ఉండగా నల్లటి నలుపు అయ్యప్పస్వామి వేషంలో సైకిల్ మీద ఎవరో ఎదురయ్యారు. నరేంద్ర గుండె గతుక్కుమంది. ఇంకేం చెయ్యగలడు? ఆ పిల్లాడు చనిపోయే ఉంటాడు. ఫలితంగా కిట్టూ?



స్కూటర్ బడ్డీకొట్టు ముందు ఆగింది. కొట్టు కుర్రాడు సిగరెట్ పాకెట్ అందించాడు. తను అడిగేలోపు అతనే చెప్పాడు. "ఆ పిల్లాడికేమైందీ తెలీలేదండీ. ఇక్కడ హాస్పిటల్‌లో టెంపరరీగా ఏదో వైద్యం చేసి గుంటూరు తీసుకెళ్ళమన్నారట."

నరేంద్ర మనసులో టెన్షన్ అలాగే ఉండి పోయింది. ఒక్క నిట్టూర్పు విడిచి స్కూటర్ స్టార్ట్ చేశాడు. ఇంటికి వెళ్ళగానే కిట్టూని చూడటానికి వెంటనే బయల్దేరాలని నిర్ణయించుకున్నాడు. ఆరున్నరకి ట్రెయిన్ ఉంది. తెల్లారేసరికి చేరతాడు. స్నానం చేసి బట్టలు సర్దుకుంటుండగా ఫోన్ మోగింది. సత్యం నుంచి. కిట్టూకి జ్వరం తగ్గిందనీ, ఆందోళన పడొద్దనీ చెప్పాడు. తర్వాత అరుణ కూడా సంతోషంగా మాట్లాడింది. వాడు కాస్త కోలుకోగానే బయల్దేరి వస్తామని చెప్పింది.

గుండెల మీద నుంచి పెద్ద బరువు దిగిపోయినట్టనిపించింది నరేంద్రకి. హుషారుగా కాఫీ పెట్టుకుని తాగి, చల్లగాలికి డాబా మీదికి వెళ్ళాడు. ఎంతో హాయిగా ఉంది వాతావరణం. సూర్యాస్తమయం. పిట్టలు గూళ్ళకి చేరుకుంటున్నాయి. పడమటి మబ్బులు ఎర్రబడ్డాయి. ఎర్రగా... అందంగా... కాదు... రక్తంలా.... నరేంద్ర మనసుని మళ్ళీ దిగులు ఆవరించింది. ఎక్కణ్ణుంచో సన్నటి ఆర్తనాదం వినిపిస్తున్న అనుభూతి 'అపరాధీ! నీకు నిష్కృతి లేదు.'

## 5

ఉదయం ఎనిమిది గంటలప్పుడు కృష్ణారావు వచ్చాడు.

''సాయంత్రం నువ్వు మా ఇంటికి వస్తున్నావు. అక్కణ్ణుంచి ఇద్దరం నీ స్కూటర్‌మీద సినిమాకి వెళతాం (తప్పదు ఇవాళే చివరిరోజు). రాత్రికి మా ఇంట్లోనే నీ భోజనం. అదీ సంగతి. వస్తాను'' అని చెప్పి అలాగే సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

అతని ధోరణే అలా ఉంటుంది. మాటల తీరులోగాని, వ్యవహార సరళిలోగాని ఒక మృదువైన నిక్కచ్చితనం ఉంటుంది. ఎదటివాళ్ళతో ఘర్షణ లేకుండానూ, అదే సమయాన స్పష్టంగానూ తన అభిప్రాయాలు వెల్లడించగలడు. ఆధునిక నాగరికతా ధూళి అతని హృదయాన్ని కప్పెయ్యలేకపోయిందని నరేంద్ర ఎప్పుడూ అనుకుంటాడు.

సాయంత్రం పెందలాడే కృష్ణారావు ఇంటికి వెళ్ళాడు. ఒక మాదిరి ఇంట్లో చిన్న వాటాలో అద్దెకుంటున్నాడు కృష్ణారావు. ఏదో ప్రైవేట్ కంపెనీలో కొద్దిపాటి ఉద్యోగం. నరేంద్ర వెళ్ళేసరికి కృష్ణారావు తయారై ఉన్నాడు.

అతని భార్య వైదేహి కాఫీలు ఇస్తూ ''అన్నయ్యా! వదిన, పిల్లలు ఊరెళ్ళారటగా? ఎప్పుడొస్తారు?'' అని అడిగింది.

నరేంద్ర కిట్టూ జ్వరం సంగతి చెప్పి, రేపో మాపో వస్తారని చెప్పాడు.

"అలాగా? పోనీలే, జ్వరం తగ్గింది కదా? వాళ్ళు వచ్చిందాకా ఇక్కడే భోంచెయ్యండి" అన్నది.

నరేంద్ర నవ్వి ఊరుకున్నాడు. తర్వాత స్నేహితులిద్దరూ స్కూటర్ మీద సినిమాకి వెళ్ళారు. ఎన్నో సినిమాలకి ఇంతకుముందు ఇద్దరూ కలిసే వెళ్ళినా ప్రస్తుతం నరేంద్రకి ఏమీ ఆసక్తిలేదు.

కృష్ణారావు టికెట్లు తీసుకున్నాడు. హాల్లో పెద్దగా జనం లేరు. 'ది సెడ్యూస్డ్' సినిమా పేరు. జాక్సన్ అనే అతనికి భార్య, పిల్లలు ఉంటారు. ఒక వ్యాపార సంస్థలో మేనేజర్. ఒకసారి అతని వద్దకి ఉద్యోగం కోసం ఒక అందమైన అమ్మాయి 'మేరీ' వస్తుంది. జాక్సన్ ఆమెని ప్రలోభపెట్టి బలాత్కరిస్తాడు. మేరీ గర్భవతి అవుతుంది. ఇంట్లోవాళ్ళ మాటలు భరించలేక, అబార్షన్‌కి ఒప్పుకోలేక, స్వయంగా నిలబడలేక చివరికి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ వార్త తెలిసి జాక్సన్ విచారిస్తాడు. అతనిలో పశ్చాత్తాపం కలుగుతుంది. ఎంతకాలానికీ అపరాధ భావన తొలగిపోదు. చివరికొక మత గురువుద్వారా అతనికి ప్రశాంతి లభిస్తుంది. 'మనిషి దోషం చెయ్యటానికే పుడతాడు. అయితే, పశ్చాత్తాపం అతణ్ణి పునీతుని చేస్తుంది' అని సినిమా సారాంశం. జాక్సన్ పాత్రధారి తనలో కామప్రకోపాన్నీ ఆ తర్వాత అపరాధ భావననీ, మానసిక సంఘర్షణనీ గొప్పగా ప్రదర్శించగలిగాడు.

హాల్లోంచి బయటికి వచ్చిన తర్వాత నరేంద్ర మనసు బరువెక్కింది. "ఎలా ఉంది సినిమా" అన్న కృష్ణారావు ప్రశ్నకి జవాబివ్వలేకపోయాడు. తనూ దోషే. కానీ, దోషాన్ని అంగీకరించగలిగాడా? కనీసం మనసు విప్పి స్నేహితుడితో కూడా చెప్పుకోలేకపోయాడు.

తిరిగి వస్తుంటే కృష్ణారావు ఆ సినిమా గొప్పదనాన్ని విశ్లేషించి చెప్పసాగాడు. నరేంద్ర మనసు ఆ మాటల మీద నిలవలేదు. కృష్ణారావింట్లో అన్నం కూడా సహించలేదు.

''అన్నం సరిగ్గా తినటమే లేదు. వదిన, పిల్లల గురించి దిగులు పెట్టుకున్నావేమిటన్నయ్యా?'' అని వేళాకోళమాడింది వైదేహి.

తిరిగి బయల్దేరే ముందు ఇంటి బయట కృష్ణారావుతో నరేంద్ర జరిగిన సంగతంతా చెప్పాడు.

''చాలా అశాంతిగా ఉంది. నీకన్నా చెప్పుకోపోతే ఉండలేననిపించింది. ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు. నీ సలహా చెప్పరా?'' అని బేలగా అడిగాడు. కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి.

కృష్ణారావు ఆత్మీయంగా నరేంద్ర చెయ్యి నొక్కాడు. ఒక్క నిమిషం ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు:

''నీ తప్పును అంగీకరించలేకపోవటమే నీ ముందున్న సమస్య అనుకుంటాను. అది అంగీకరించనంత కాలం నీకు మనశ్శాంతి ఉండదు. సలహా సంగతికాదు గానీ, నీ పరిస్థితిలో నేనే ఉంటే ఏం చేస్తానంటే....నేరుగా ఆ పిల్లవాడి తల్లితండ్రుల దగ్గరికి పోయి నా తప్పును వెల్లడిస్తాను. రాబోయే శిక్షని భరిస్తాను.''

నరేంద్ర మనసు కేదో కొంత దారి దొరికినట్టనిపించింది. ఒక్క క్షణం ఆగి ''వెళ్తాను'' అన్నాడు కృష్ణారావుతో.

''నువ్వా ఆలోచించు. అధైర్యపడవద్దు. నీ కోసం నేనున్నాను'' అని చెప్పి పంపించాడు కృష్ణారావు.

## 6

రాత్రి చాలాసేపు మథనపడ్డాడు నరేంద్ర. కృష్ణారావు మాటలు నిజమే. తన అపరాధం అంగీకరించినదాకా తనకీ ఘర్షణ తప్పదు. యాక్సిడెంట్ సంగతి ఎవరికీ తెలీకుండా తప్పించుకోగలిగాడు. కానీ, తన ఆత్మ నుంచి ఎలా తప్పించుకోగలడు? స్పందన లేని రాయి కాదు గదా హృదయం? తనకి కిట్టూ ఎలాంటివాడో ఆ తల్లితండ్రులకి ఆ పిల్లాడూ అటువంటివాడే గదా? ఆ పిల్లాడు జీవించినా మరణించినా తనిప్పుడు చెయ్యగలిగింది లేదు. కానీ, చేసిన తప్పు నుంచి పారిపోయి ద్రోహి మాత్రం కాలేడు. ఈ సందర్భంలో భగవంతుడు తనను కాపాడలేడు. తనను తానే కాపాడుకోవాలి. ఇప్పుడు భయం తన శత్రువు. దాన్ని జయిస్తేనే తను మనిషి.

ఇలా నిశ్చయించుకున్న తర్వాత నరేంద్రకి హాయిగా నిద్ర పట్టింది.

రాత్రి చాలా సేపు మథన పడ్డాడు నరేంద్ర. ఆ పిల్లాడు జీవించినా మరణించినా తనిప్పుడు చెయ్యగలిగింది లేదు. ఇప్పుడు భయం తన శత్రువు. దాన్ని జయిస్తేనే తను మనిషి.

## 7

తెల్లారి నిద్ర లేస్తూనే నరేంద్ర త్వర త్వరగా కాలకృత్యాలు తీర్చుకుని స్కూటర్ బయటికి తీశాడు. నేరుగా బోస్ రోడ్డుకి వెళ్ళాడు. ఆ పిల్లాడు తల్లితండ్రుల గురించి అడుగుతూ పోయి చివరికి ఇల్లు తెలుసుకున్నాడు. ఒక పెంకుటింట్లో చిన్న వాటా అది. తాళం వేసి ఉంది. పక్క వాటా వాళ్ళని అడిగాడు. అక్కడి ముసలాయన చెప్పాడు:

"హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం. ఏదో కట్టు కట్టి ఇక్కడ లాభం లేదని, గుంటూరు తీసుకెళ్ళమని చెప్పారు. వాళ్ళమ్మ ఒక్కతే. భర్త లేడు. ఏదో కష్టపడి బతుకు వెళ్ళమారుస్తుంటే, ఇప్పుడీ ఆపద వచ్చింది. మా వాడు కూడా తోడుగా వెళ్ళాడు. ఎముకలు విరిగాయన్నారు. ప్రాణాపాయం ఉండదేమోలెండి. మంచి హాస్పిటల్‌లోనే చేర్పించమని చెప్పాను.

నరేంద్రకి ఒకేసారి తన పట్ల అసహ్యమూ, ఆ పిల్లాడి బతుకు పట్ల కొంచెం ఆశా కలిగాయి. ఇప్పటికైనా తను మంచి నిర్ణయమే తీసుకున్నాడు. వాళ్ళకి సాయపడటానికి ఇంకా సమయం మించిపోలేదేమో.

ఇంకా ఆలస్యం చెయ్యదలుచుకోలేదు నరేంద్ర. స్కూటర్ టాంకు నిండా పెట్రోలు కొట్టించాడు. ఏభై కిలోమీటర్లు ఉంది గుంటూరు. శరీరం నీరసంగా ఉంది. పైన ఎండ అయినా, మనసు రాను రాను దృఢంగా తయారవుతోంది. వెంటనే బయల్దేరాడు. కృష్ణారావు ఆఫీసుకి వెళ్ళి కలుపుకు వెళ్దామా అని ఒక్క క్షణం అనిపించింది. 'వాడికి సెలవు దొరుకుతుందో లేదో. పైగా, ఇంకా ఆలస్యమైపోతుంది. ముందు గుంటూరు వెళ్ళొచ్చి తర్వాత కలుస్తాను వాణ్ణి' అనుకున్నాడు మళ్ళీ

ట్రంక్ రోడ్డులో వచ్చే పోయే లారీలు, బస్సుల గాలి విసుర్ల వల్ల ముఖమంతా కమిలిపోయింది. పైన ఎండ మాడ్చేస్తూంది. అయితే, ఇవేవీ నరేంద్ర గమనించే స్థితిలో లేడు. కళ్ళ ముందు ఆ పిల్లాడి రూపమే కనిపిస్తోంది. తల్లి తప్ప ఎవరూ లేరు. అజాగ్రత్తగా యాక్సిడెంట్ చేసి వాళ్ళనలా వదిలెయ్యటం ఎంత ఘోరం?

గుంటూరులో అతని పని కష్టమైంది. జనరల్ హాస్పిటల్‌లో వాళ్ళు దొరకలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఈ సమయంలో తోడుంటే బాగుండేది. ఏ డాక్టర్ దగ్గరికి వెళ్ళుంటారు? బహుశా ఏ ఆర్థోపెడీషియన్ దగ్గరికో వెళ్ళి ఉండాలి. ఇలా ఆలోచించి ఒక మందుల షాపుకి వెళ్ళి ఊళ్ళోని ఎముకల స్పెషలిస్టుల గురించి అడిగాడు. తెలిసిన పేర్ల ప్రకారం నాలుగైదు హాస్పిటల్స్‌కి వెళ్ళి కనుక్కున్నాడు. నిరాశే ఎదురైంది. పొట్టలో ఎత్తు లేదు. ఒకటే నీరసం. ఇంకొక్క డాక్టరు పేరు మిగిలింది. అక్కడికీ వెళ్ళొస్తే సరిపోతుందేమో అనుకున్నాడు నరేంద్ర.

అశ్వనీ హాస్పిటల్ ముందు స్కూటర్ ఆపాడు. లోపలికి వెళ్ళి కన్పించిన నర్సునడిగాడు.

"ఓ. ఆ ఊరు నుంచి వచ్చిన కేసేగా. స్కూటర్ యాక్సిడెంట్. కంగారేం లేదు. కుర్రాడు బతుకు తాళ్ళొండి. రూం నెంబర్ తొమ్మిదిలో ఉన్నాడు. వెళ్ళండి" అన్నదామె.

నరేంద్ర కళ్ళకి ఆమె దేవతలా కనిపించింది. అప్పటిదాకా పడిన మానసిక వ్యధ ఫలితమో ఏమో కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. మెల్లగా నడిచి తొమ్మిదో గది వద్ద ఆగాడు. తలుపు ఓరగా వేసి ఉంది. తలుపు సందులోంచి బెడ్ మీద బేండేజి కట్లతో పడుకొని ఉన్న చిన్న ఆకారం కనిపించింది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. కాసేపు తటపటాయించాడు.

ఆ తర్వాత దృఢమైన నిశ్చయంతో లోపలికి అడుగుపెట్టాడు. ■

